క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత



కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంపీపీ నౌడు వెంకటరమణ

రాయవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్లు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలంలో మాచవరం గ్రామ పరిధిలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు ఎంపీపీ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీనివాస్, మాచవరం గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళా భద్రతకు భరోసా

కాజులూరు: దిశ యాప్ ద్వారా మహిళల భద్రతకు భరోసా లభిస్తోందని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.తులసీరామ్ అన్నారు. శనివారం గ్రామంలో దిశ యాప్‌పై మహిళా పోలీసులు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా భద్రతకోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ మొబైల్ యాప్‌ను విద్యార్థినులు, యువతులు, మహిళలు డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర సమయాల్లో రక్షణ పొందాలన్నారు. గ్రామాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లే మహిళల మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి ఉపయోగించే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏఎస్సై నెల్లి బాలరాజు, డేవిడ్, సిబ్బంది కుమార్, వెంకటరమణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



రాయవరం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎల్ఎస్ఎస్వీ ప్రసాద్

రాయవరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎల్ఎస్ఎస్వీ ప్రసాద్ సూచించారు. రాయవరం శాఖా గ్రంథాలయాన్ని ప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మంచి స్నేహితునితో సమానమని, పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం, సృజనాత్మకత, నైపుణ్యం పెంపొందుతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు వెళ్లే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. జూన్ 16 వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ



ద్రాక్షారామలో మహిళలకు చీరలు పంచిన ఎన్టీఆర్ సేవాసమితి సభ్యులు

రామచంద్రపురం రూరల్: జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం ద్రాక్షారామలో ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ బోస్‌బొమ్మ సెంటర్ వద్ద భారీ కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలు పంచారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవాసమితి గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్రీనివాసకుమార్, అధ్యక్షుడు సాదే రాజేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు శివచంద్రశేఖర్, సెక్రటరీ శీలం మణికంఠ, జాయింట్ సెక్రటరీ క్రాంతికుమార్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో వలస కార్మికుడి గల్లంతు



గోదావరిలో గల్లంతైన వలస కూలి

కపిలేశ్వరపురం: కేదారిలంకలోని ఇటుక బట్టీలో కూలి పనిచేస్తున్న వలస కూలి శుక్రవారం అదే గ్రామంలోని గౌతమి గోదావరిలో శనివారం గల్లంతయ్యాడు. వీఆర్వో తణుకువాడ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అంగర ఏఎస్సై టీఎస్ రంగారావు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... ఒడిశాలోని కోరాపుట్ జిల్లాకు చెందిన తడింగి సోబన (56) రెండు నెలల క్రితం గ్రామంలోని పోలిశెట్టి గణేష్ నిర్వహణలోని ఇటుక బట్టీలో కూలికి చేరాడు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక గౌతమి గోదావరి నది రేవులో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి ఎస్సై బి.శివకృష్ణ సందర్శించారు. గజ ఈతగాళ్లతో గాలించగా మృతదేహం లభ్యం కాలేదు.

పది తప్పిన వారికి ప్రత్యేక తరగతులు

- ఉత్తీర్ణులై ఇంటర్‌లో చేరేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సబ్జెక్టు టీచర్లతో విద్యా బోధన



విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల విడుదలైన పది పరీక్షల్లో తప్పిన విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వారికి సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులై తమ తోటి విద్యార్థులతో పాటుగా ఇంటర్మీడియెట్ తదితర కోర్సుల్లో చేరడానికి వారికి అవసరమైన మద్దతు ఇస్తోంది.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని మండలాల్లో పదో తరగతి ఫెయిలైన వారి వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం మండలంలో 1477 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 468 మంది, కె.గంగవరం మండలంలో 471 మందికి 178 మంది, కాజులూరు మండలంలో 605 మందికి 174 మంది ఫెయిలయ్యారు. మండపేట మండలంలో 1746 మందికి 368 మంది, కపిలేశ్వరపురం మండలంలో 560 మందికి 134 మంది, రాయవరం మండలంలో 652 మందికి 191 మంది ఫెయిలయ్యారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. గతంలో కేవలం ఉత్తీర్ణత శాతంపైనే దృష్టి సారించేవారు. అయితే విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పరీక్ష తప్పిన విద్యార్థులకు ప్రతి పాఠశాలలోనూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి 10 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే తమ తోటి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియెట్ తదితర కోర్సుల్లో చేరడానికి అవకాశం ఏర్పడుతుంది. పరీక్షలు తప్పిన విద్యార్థులపై ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 2 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు..

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10 వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగనున్నాయి. జూన్ 2న ఫస్ట్ లాంగ్వేజ్, 3న సెకండ్ లాంగ్వేజ్, 5న ఇంగ్లిష్, 6న మ్యాథ్స్, 7న సైన్స్, 8న సోషల్ స్టడీస్, 9, 10 తేదీల్లో మెయిన్ లాంగ్వేజ్ పరీక్షలు జరుగుతాయి.

విద్యా సంవత్సరం కోల్పోకుండా..



పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రతేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థి ఏ సబ్జెక్టులో ఫెయిలైతే ఆ సబ్జెక్టు ఉపాధ్యాయులతో పాఠాలు చెప్పించడంతో పాటు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఎంతో విలువైన విద్యా సంవత్సరం కోల్పోకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం.

– పీఎస్‌బీఎస్‌కే సుందరి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం, ద్రాక్షారామ

విద్యార్థులకు సువర్ణావకాశం



గతంలో ఎన్నడూ లేని విధంగా పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించడం వారికి సువర్ణావకాశం. ఫెయిలైన ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి బోధన చేయడం జరుగుతోంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పి.షాలెంరాజు, డీవైఈఓ, రామచంద్రపురం డివిజన్

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- మండపేట పాటి మీద గడప గడపకూ..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదల అభ్యున్నతి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం మండపేట 13వ వార్డు పాటి మీద ఎమ్మెల్సీ తోట పర్యటించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. మూడేళ్ల పాలనలో వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ఆయన అక్కడికక్కడే మున్సిపల్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ చోడే సత్యకృష్ణ, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు యాంద్ర బుజ్జి, సోమేశ్వరరావు, ముత్తు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన



దేగలపేటలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కాజులూరు: గ్రామాల్లో అపారిశుధ్యం నిర్మూలనతోనే ప్రజారోగ్యం మెరుగుదల సాధ్యమౌతుందని పార్టీ మండల బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావులు అన్నారు. గొల్లపాలెం శివారు దేగలపేట ఎస్సీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శనివారం ఏసురాజు, బాబూరావులు సంయుక్తంగా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జగనన్న ప్రభుత్వానికి రెండూ రెండుకళ్లని ఏ ఒక్కదాన్ని ఆయన విస్మరించడం లేదన్నారు. కరోనా విపత్కర సమయంలో పేదలకు కూలి పనులు సైతం లేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యారని ఆ పరిస్థితులలో సీఎం జగనన్న అందించిన సంక్షేమ కార్యక్రమాలే ప్రజల జీవన ప్రమాణాలను కాపాడాయన్నారు. అదే రీతిన నేడు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు నిర్మాణాలు, గ్రామాల్లో డ్రెనేజీ నిర్మాణాలు, తాగునీటి వసతుల ఏర్పాటుతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, పలువురు స్థానిక పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి



అముజూరులో ఇళ్ల నిర్మాణం ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ జయరామలక్ష్మి, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ

కె.గంగవరం: జగనన్న ఇళ్ల కాలనీలో స్థలాలకు ఎంపికైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఏడీఏ జయరామలక్ష్మి, తహసీల్దార్ వైద్యనాథ శర్మ సూచించారు. మండలంలోని అముజూరులో ఇళ్ల స్థలాల్లో నిర్మాణాల ప్రక్రియను శనివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఇప్పటికే ఇళ్ల స్థలాలను కేటాయించి పట్టాలను కూడా అందించామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆర్థిక సాయంతో పాటు లబ్ధిదారులపై భారం పడకుండా సిమెంట్ బస్తాలను ఇంతకుముందు కన్నా మరో 50 బస్తాలు అధికంగా ఇస్తుందన్నారు. ఇప్పటికే సిమెంట్ బస్తాలు లబ్ధిదారులకు అందుబాటులో ఉంచామని ప్రజాప్రతినిధులు, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంగా పనిచేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులకు డ్వాక్రా గ్రూపు ద్వారా ఇళ్ల నిర్మాణానికి రుణాలు ఇస్తున్నారని వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి సీతారామయ్య చౌదరి, ఇంజినీరింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నమ్మించి వంచించిన ఎన్‌ఆర్‌ఐపై కేసు

మండపేట: బాధితురాలి ఫిర్యాదు మేరకు వివాహం చేసుకుంటానని నమ్మించి మోసగించిన ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ)పై మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు రావులపాలేనికి చెందిన కె. వెంకటేష్ నుంచి గతేడాది జనవరిలో మండలంలోని కేశవరానికి చెందిన యువతి సెల్‌ఫోన్‌కు హాయ్ అని మెసేజ్ వచ్చింది. మ్యారేజ్ వెబ్‌సైట్ ద్వారా మీ వివరాలు తెలుసుకుని మెసేజ్ పెట్టానని చెప్పి పరిచయం పెంచుకున్నాడు. తర్వాత తరచూ వాట్సప్ ద్వారా చాటింగ్, వీడియో కాల్స్ చేసేవాడు. పెళ్లి చేసుకుంటాడన్న ఉద్దేశంతో వెంకటేష్‌తో యువతి పరిచయం పెంచుకుంది. కొద్దిరోజులకు ఉద్యోగం రీత్యా అమెరికా వెళ్లిపోయాడు. ఇండియా వచ్చాక పెళ్లి చేసుకుంటానని ఫోన్‌లో నమ్మించాడు. ఈ నెలలో రావులపాలెం వచ్చాడు. వారం రోజుల క్రితం కారులో తన తన వెంట రాజమహేంద్రవరంలోని పలు ప్రాంతాల్లో కారులో తిప్పి లైంగికంగా వేధించగా అందుకు ఆమె అభ్యంతరం తెలిపింది. మరుసటి రోజున ఫోన్ చేయగా ఇష్టం లేదని చెప్పి ముఖం చాటేశాడు. అతని అడ్రస్ తెలుసకుని ఇంటికి వెళ్లి ప్రశ్నించగా తమ కుమారునికి వేరే సంబంధం చూస్తున్నామని చెప్పి అతని తండ్రి తనను ఇంటికి తీసుకువచ్చి దించి వేసి తన తల్లిదండ్రులను బెదిరించినట్టు యువతి ఫిర్యాదులో పేర్కొంది. అతనిపై నమ్మకంతో వచ్చిన సంబంధాలు పోగొట్టుకున్నానని, వెంకటేష్ ఇటీవల వేరే యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ బి శివకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదు



ఆటోడ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

రాయవరం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకు వెళ్లరాదని ఎస్సై సురేష్ డ్రైవర్లకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని ఆటో డ్రైవర్లతో ఎస్సై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఆటో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటో డ్రైవర్లకు కూడా కుటుంబాలు ఉంటాయని, ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రయాణికుల కుటుంబాలతో పాటు ఆటో డ్రైవర్ల కుటుంబాలు కూడా రోడ్డున పడుతున్న సందర్భాలు ఉన్నాయన్నారు. నిబంధలను అనుసరించి ప్రయాణికులను ఆటోల్లో తీసుకువెళ్లాలని సూచించారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనుకాడనన్నారు.

350 మందికి హోమియో వైద్య సేవలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రతినెల క్రమం తప్పకుండా ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి కోరారు. అర్తమూరులోని ట్రస్టు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన 159వ ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రాజమహేంద్రవరం అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల వైద్యులు 350 మందికి వైద్యసేవలు అందించగా బులిస్వామిరెడ్డి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, తాడి కోదండరామారెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి, కేవీఎస్ఎన్ రాజు, జీవీవీఎస్ఎన్ మూర్తి, చింతా వెంకటకృష్ణారెడ్డి, పి పద్మావతి పాల్గొన్నారు.

కురిసింది వాన..



మండపేటలో కురుస్తున్న వర్షం


మండపేట: కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న పౌరులకు ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం ఉపశమనం కలిగించింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని, గాలులు, ఉరుములు, మెరుపులతో మండపేట, మండల గ్రామాల్లో వర్షం కురిసింది. వారం రోజులుగా అధిక ఎండలు, వేడి గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం వేడి గాలులతో అవస్థలు పడాల్సి వచ్చింది. ద్రోణి ప్రబావంతో సాయంత్రమయ్యే సరికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. ఆకాశం మేఘావృతమై గాలులుతో భారీ వర్షం కురవడంతో జన జీవనం సేద తీరింది. ఈదురు గాలుల ప్రబావంతో సాయంత్రం ఐదు గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షం తగ్గాక రాత్రి 7.30 గంటల సమయంలో సరఫరాను పునరుద్ధరించారు. మండపేట ప్రాంతంలో రబీ వ్యవసాయ పనులు దాదాపు పూర్తి కావడంతో వర్షం వలన నష్టం ఏమీ ఉండదని అధికారులు తెలిపారు.

కె.గంగవరం: గత వారం రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులు, ఉరుములతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. సుమారు అరగంట సేపు ఏకధాటిగా వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు ఈదురు గాలులను ఆస్వాదించారు. ఎండ తీవ్రతతో వృద్ధులు, చంటిపిల్లలు సతమతమవుతున్న తరుణంలో వాతావరణ చల్లబడడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు కొంత ఉపశమనం పొందారు.



మబ్బులతో మేఘావృతమై కనువిందు చేస్తున్న ఆకాశం

అబ్బుర పరుస్తున్న చిలుక మామిడి



గొల్లపాలెంలో చూపరులను అబ్బురపరుస్తున్న చిలుక మామిడి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం పండ్ల మార్కెట్‌లో శనివారం మామిడి చిలుక చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. గ్రామానికి చెందిన పండ్ల వ్యాపారి జి.వినయ్ మామిడిపండ్లను హోల్‌సేల్‌గా కొని తెచ్చి మార్కెట్లో రాశులుగా పోసి విక్రయిస్తున్నాడు. తణుకువాడకు చెందిన కాలా శ్రీను పండ్లు కొనుగోలు చేస్తుండగా చిలుక ఆకారంలో ఉన్న మామిడి పండు బయటపడింది. దీంతో ఆసక్తికరంగా ఉన్న ఈ మామిడి చిలుక చూసేందుకు స్థానికులు పండ్ల దుకాణం వద్ద గుమిగూడారు. కవల అరటిపండ్లు మాదిరి పూత సమయంలో రెండు మామిడి పిందెలు కలిసిపోయి పెరగటంతో ఈ రూపం సంతరించుకుందని మండల ఏవో అశోక్ తెలిపారు.

ఆర్‌ఆర్‌ఆర్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు



రామచంద్రపురం ఓపెన్ ఆడిటోరియం వద్ద ఆర్‌ఆర్‌ఆర్ స్టోరేజ్ సెంటర్ ప్రారంభించి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం: పట్టణంలోని 16 వ వార్డు చప్పిడి వారి సావరంలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం ప్రాంగణంలో 'ఆర్‌ఆర్‌ఆర్' (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) స్టోరేజ్ సెంటర్‌ను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సెంటర్‌లో ప్రజల నుంచి వారి వద్ద నిరుపయోగంగా ఉన్న వస్తువులు, దుస్తులు, బెడ్‌షీట్లు, బూట్లు, బ్యాగ్‌లు, ప్లాస్టిక్ వస్తువులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, ఎలక్ట్రికల్ వస్తువులు తదితర వస్తువులను సేకరించి వాటిని అవసరమైన పేదలకు అందజేస్తారు. ప్రజలకు బేనర్లతో సెంటర్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోతంశెట్టి గోపాలకృష్ణ, పెంటపాటి శ్రీను, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

రామచంద్రపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎండలు మండుతున్న దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ అందజేయాలని, వడదెబ్బ మృతులకు రూ.2 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

వస్త్ర వర్తక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం



అంగర చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న సంఘం నాయకులు

కపిలేశ్వరపురం: ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగరలోని ఆది గణపతి సెంటర్‌లో శనివారం గ్రామ వస్త్ర వర్తక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం నాయకులు శాగా వీరబాబు, పదం సత్తిబాబు మాట్లాడుతూ జీవనోపాధి కోసం వ్యవసాయ కూలీలు, ద్విచక్ర వాహనాలపై పండ్లు, వస్త్రాలను విక్రయించే చిరువ్యాపారులు, ప్రయాణికులు ఎండల్లో సైతం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

కేదారిలంకలో 30 మందికి కంటి పరీక్షలు



కేదారిలంకలో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక సచివాలయంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 30 మందికి కంటి పరీక్షలను చేశారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 20 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఇద్దరికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, సచివాలయ ఉద్యోగులు సందర్శించారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు పల్లాలమ్మ, అనూష, వలంటీర్లు సేవలందించారు.

రూ.20 వేల విలువైన మద్యం బాటిళ్ల పట్టివేత

కపిలేశ్వరపురం: యానాం నుంచి రావులపాలెం వైపు గౌతమి గోదావరి గట్టు మీదుగా మోటార్ సైకిల్‌పై మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని శనివారం అమలాపురం ఎస్ఈబీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ ఎస్సై కె.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన నిందితుడు సింగులూరి కృష్ణప్రసాద్‌ను కపిలేశ్వరపురం గోదావరి గట్టుపై పట్టుకున్నామన్నారు. అతని నుంచి 25 కొరియర్ నెపోలియన్ ఫ్రెంచ్ బ్రాందీ బాటిళ్లను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ కానిస్టేబుల్స్ ఇ.పవన్‌కుమార్, డి.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన లారీ

పి.గన్నవరం: రాజవరం–పొదలాడ రోడ్డులో పెదకందాలపాలెం వద్ద శనివారం ఇసుక లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదకందాలపాలెం ర్యాంపు నుంచి లోడుతో జగ్గన్నపేట వైపు వెళ్తున్న లారీ చర్చి వద్ద సైడు రోడ్డులో నుంచి వస్తున్న మోటారు సైక్లిస్టును తప్పించబోయి అదుపు తప్పింది. దీంతో పంట కాలువపై పెపు మార్జిన్‌లో ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో ఎదురుగా ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కాలువలో పడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడికి చెందిన గుంటూరి లక్ష్మీపతిరాజు (58) శుక్రవారం సాయంత్రం కాలువలోకి వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారి పడి మృతి చెందినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు.